# జలయజ్ఞం



*నిత్యగోదావరీ స్నాన*
*పుణ్యదోయో మహామతిః*
*నమామ్యాంగ్లేయ దేశీయం*
*కాటనుంతం భగీరథం*

*భావం:* గోదావరి జలాలతో నిత్యం స్నానం చెయ్యడం వల్ల కలిగే పుణ్యాన్నిచ్చిన మహామనీషి, ఆంగ్లేయ దేశీయుడూ, అపరభగీరథుడూ అయిన కాటనుకి నమస్కరిస్తున్నాను.

సుమారు నూట యాభై ఏళ్ళపై మాట. గోదావరి జలాలతో నిండిన కాలువలపై నుండి పైరగాలి చల్లగా వీస్తున్నది. ఉదయమే ఒక ఆంగ్లేయుడు

గుర్రంపై వ్యాహ్యాళికి బయలుదేరాడు. కాలువలో స్నానం చేసి అనేకులు భగవంతుని వివిధ రూపాలకు అర్ఘ్యాలిస్తున్నారు. ప్రార్థనలో తనపేరు వినిపించి దొర ఆగిపోయాడు. ప్రార్థనా శ్లోకంలోని అర్థాన్ని తెలుసుకున్న అతని నేత్రాలలో ఆనందబాష్పాలు నిలిచాయి. మనస్సు గతం లోకి వెళ్ళింది.

పై సన్నివేశకాలానికి ఇరవై, ముప్పై ఏళ్ళ ముందు నేడు కోస్తా జిల్లాలుగా చెప్పబడుతున్న ప్రాంతంలో చాలా భాగం అరణ్యమయం. మిగిలిన భూమిలో అక్కడక్కడా పల్లెలుండేవి. వర్షాధారపు పంటలతో పల్లె ప్రజలు జీవించేవారు. నదీ తీరాలలో జలవసతి ఉన్నా వరదలతో పంట పాడవుతుందన్న భయం ఉండేది. వరితో వంట పండుగలకూ, తద్దినాలకీ పరిమితం.

ఆ పరిస్థితులలో భయంకర క్షామం వచ్చింది. గుమ్మడికాయ ఉడకపెట్టుకుని తిన్నారు. అది కూడా దొరకని నాడు మట్టి నీటిలో కలుపుకుని ఆ నీరు వడకట్టి తాగి ప్రాణాలు నిలుపుకున్నారు. ప్రభుత్వం అక్కడక్కడ గంజిదొడ్లు ఏర్పాట్లు చేసింది. ప్రజల కష్టాలను చూసిన ఒక ఆంగ్లేయ ఇంజనీరు మనస్సు కరిగింది. ఆ ఇంజనీరు ఆర్థర్ కాటన్. గోదావరి ఆనకట్ట కడితే ప్రజల ఇక్కట్లు తీరతాయనుకున్నాడు.

కానీ ప్రభుత్వాన్ని ఒప్పించడమెలా? అప్పుడు ఈస్ట్ ఇండియా కంపెనీ రాజ్యమేలుతున్నది. మొదట్లో వర్తకానికై వచ్చింది. స్వదేశీ ప్రభువుల మధ్య యుద్ధాలతో రాజ్య విస్తరణ చేస్తున్నది. విదేశీ గడ్డపై శాశ్వత నిర్మాణంపై శ్రద్ధ వారికి ఎలా కలిగించాలి? కాటన్ ఆలోచించాడు. ఆనకట్ట ఉంటే పంటలు బాగా పండుతాయి. పన్నులు బాగా వసూలు చెయ్యవచ్చును. ప్రభుత్వానికి ఈ ఆర్థిక ప్రాతిపదిక నచ్చింది. ప్రజా సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం అన్న కుహనా వాదం లేకుండానే నిర్మాణం ప్రారంభమైంది.

నేటి వలె అన్నదాతల ఆత్మహత్యలకు మొసలి కన్నీరు కారుస్తూ పరస్పర నిందారోపణలు చేసుకునే నాయకులు లేరు. చెంచాడు సిమెంటు

వెయ్యడమే మహద్భాగ్యమనుకునే ఇంజనీర్లూ, కంట్రాక్టర్లూ లేరు. ఆనకట్ట కడితే ఆత్మార్పణ చేస్తామంటూ అడ్డుకునే 'మేధా' వినులూ లేరు. శీఘ్రగతిననిర్మాణం జరిగింది.

నేడున్న రోడ్లూ, రైళ్ళూ లేవు. గుర్రం మీద తిరుగుతూ, కాలువలు ఎక్కడ ఎలా తవ్వించాలో కాటన్ నిర్ణయించాడు. ఆనకట్ట నిర్మాణం పూర్తయ్యేసరికి కాలువలతవ్వకం పూర్తయ్యింది. గోదావరి జలాలు మారుమూల ప్రాంతాలకు కూడా అందాయి. భూమి సస్యశ్యామలం అయింది. కాటన్ దొరలో భగవంతుని చూశారు ఆ ప్రాంత ప్రజలు.

అందుకే 'గోదావరీ జల స్నాన పుణ్యానిచ్చినవాడూ, మహామతీ ఆంగ్లేయ దేశీయుడూ, భగీరథుడూ అయిన కాటన్‌కి నమస్కరిస్తున్నాను.' అని ఉదయమే భగవంతునితో సమంగా ప్రార్థనలు చేశారు.

తన ప్రయత్నం సఫలమైందని ప్రజల ఆనందాన్ని చూసిన కాటన్ సంతోషించాడు.

సర్ ఆర్థర్ కాటన్ వంటి వ్యక్తిని మళ్ళీ మాకు ప్రసాదించమని భగవంతుని కోరుకోవడం ఈనాడు మనమందరం చెయ్యవలసిన ప్రార్థన కాదా?

******